

టీ20 ప్రపంచకప్, చాంపియన్స్ ట్రోఫీలతో కలిసి దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా వద్ద ఐసీసీ చైర్మన్ జై షాతో భారత సారథి రోహిత్ శర్మ

## రిటైర్మెంట్‌పై స్పష్టతనిచ్చిన జడ్డూ

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత వన్డే ఫార్మాట్ నుంచి తప్పుకుంటారని వచ్చిన వార్తలపై భారత క్రికెటర్లు ఒక్కొక్కరుగా స్పందిస్తున్నారు. తాను వన్డేల నుంచి రిటైర్ అవడం లేదని ట్రోఫీ గెలిచిన తర్వాత నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రోహిత్ శర్మ నొక్కి వక్కాణించగా తాజా గా రవీంద్ర జడేజా సైతం స్పందించాడు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో అతడు స్పందిస్తూ.. 'అనవసర పుకార్లు వద్దు. ధన్యవాదాలు' అని రాసుకొచ్చి రిటైర్మెంట్ వార్తలకు చెక్ పెట్టాడు.

## పికిల్‌బాల్‌కు ప్రోత్సాహం



హైదరాబాద్ ఆట ప్రతినిధి: ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పికిల్‌బాల్ క్రీడను తెలంగాణ వ్యాప్తంగా అందరికీ చేరువ చేసి ఆటను ప్రోత్సహిస్తామని హైదరాబాద్ పికిల్ బాల్ సంఘం అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు అన్నారు. ఆటలో ప్రతిభావంతులను గుర్తించి వాళ్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషిచేస్తామని చెప్పారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్ సమీపంలో పాడిల్‌వెల్ అనే సంస్థకు చెందిన పికిల్ బాల్, బాక్స్ క్రికెట్, సాకర్ కోర్టులను ప్రారంభించిన శ్రీనివాస్ బాబు.. నిర్వాహకులను అభినందించారు.

# స్పిన్నర్లే విన్నర్లు

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం



పన్నెండేండ్ల సుదీర్ఘ విరామానికి తెరదించుతూ భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచి ముచ్చటగా మూడోసారి ట్రోఫీని ముద్దాడింది. సమిష్టి ప్రదర్శనతో టీమ్‌ఇండియా విజేతగా నిలిచినప్పటికీ రోహిత్ సేన విజయాల్లో స్పిన్ మాంత్రికులది కీలక పాత్ర అన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. సీనియర్ స్పిన్నర్లు రవీంద్ర జడేజా, చైనామెన్ కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌కు తోడుగా ఇటీవలే వన్డే జట్టులోకి వచ్చిన వరుణ్ చక్రవర్తి అంచనాలకు మించి రాణించారు. టోర్నీ ఆసాంతం నిలకడగా రాణించిన ఈ చతుష్టయం.. ప్రత్యర్థులను తమ స్పిన్ ఉచ్చులో బంధించి ఉక్కిరిబిక్కిరి చేసింది. టీమ్‌ఇండియా తురుపుముక్క జస్‌ప్రీత్ బుమ్రా గాయంతో వైదొలగడం.. ఏడాదిన్నర విరామం తర్వాత షమీ పునరాగమనం చేసి పూర్తిస్థాయిలో ఫామ్ సంతరించుకోకపోవడం.. అంతగా అనుభవం లేని హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ జట్టులో ఉండటంతో భారత బౌలింగ్ విభాగం బలహీనంగా కనబడినా.. రోహిత్ సేన ఆస్ట్రేలియా, పాకిస్థాన్, న్యూజిలాండ్ వంటి బలమైన ప్రత్యర్థులను మట్టికరిపించిందంటే అది ఈ నలుగురి వల్లే. టోర్నీలో వరుణ్ మూడు మ్యాచ్‌లే ఆడి 9 వికెట్లు (అత్యధిక వికెట్ల వీరుల్లో అతడు రెండోస్థానంలో నిలిచాడు) పడగొట్టగా అక్షర్ (5 మ్యాచ్‌లలో 5), కుల్‌దీప్ (5 మ్యాచ్‌లలో 7), జడ్డూ (5 మ్యాచ్‌లలో 5) సత్తా చాటారు. టోర్నీలో ఈ నలుగురిలో ఏ ఒక్కరి ఎకానమీ రేట్ కూడా 4.8 దాటలేదు.

సాధారణంగా ఇద్దరు పేసర్లు, ఒక బ్యాటింగ్ ఆల్‌రౌండర్, ఇద్దరు స్పిన్నర్ల కూర్పుతో బరిలోకి దిగే టీమ్‌ఇండియా.. తొలి రెండు మ్యాచ్‌ల తర్వాత ఏకంగా నలుగురు స్పిన్నర్లను ఆడించి ఫలితాలను రాబట్టింది. స్లో పిచ్‌లకు నెలవైన దుబాయ్‌కు వెళ్లడానికి ముందే ఈ టోర్నీలో ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లను ఎంపిక చేసినప్పుడే అందరూ నోరెళ్లబెట్టారు. కుల్‌దీప్, అక్షర్ చాలునని జడ్డూ ఎందుకని విమర్శకులు పెదవి విరిచారు. అదీగాక అక్షర్ మినహా కుల్‌దీప్, జడ్డూ కూడా అంత గొప్ప ఫామ్‌లో కూడా లేకపోవడం విమర్శకుల ఆరోపణలకు బలమిచ్చింది. కానీ బంగ్లాతో మ్యాచ్‌లోనే ఈ త్రయం విలువేంటో విమర్శకులకు అర్థమైంది. ఈ ముగ్గురూ ఆ మ్యాచ్‌లో 2 వికెట్లే తీసినా తమ బౌలింగ్‌తో ప్రత్యర్థిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టడంలో సఫలీకృతమయ్యారు. పాక్‌తో పోరులో ఈ త్రయం.. 5 వికెట్లు పడగొట్టింది. ఈ ముగ్గురినీ రోహిత్ అద్భుతంగా వినియోగించుకున్నాడు. ఎంత టీ20లు వచ్చినా 50 ఓవర్ల పాటు సాగే వన్డే ఫార్మాట్‌లో బ్యాటర్లు మిడిల్ ఓవర్లలో నెమ్మదిగా ఆడినా డెత్ ఓవర్లలో ధాటిగా ఆడతారు. కానీ రోహిత్ అనూహ్యంగా డెత్ ఓవర్లలో కుల్‌దీప్, అక్షర్ చేతికి బంతినిచ్చి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో విజయవంతమయ్యాడు. అక్షర్ అటు బంతితో పాటు బ్యాట్‌తోనూ ఆపద్బాంధవుడిగా నిలిచాడు.

**చాంపియన్స్ ట్రోఫీలో స్పిన్ చతుష్టయం గణాంకాలు**

| పేరు | మ్యాచ్‌లు | ఓవర్లు | వికెట్లు | సగటు | ఎకానమీ |
|---|---|---|---|---|---|
| అక్షర్ | 5 | 45 | 5 | 39.20 | 4.35 |
| కుల్‌దీప్ | 5 | 46.3 | 7 | 31.85 | 4.79 |
| జడేజా | 5 | 42 | 5 | 36.60 | 4.35 |
| వరుణ్ | 3 | 30 | 9 | 15.11 | 4.53 |

### సర్‌ప్రైజ్ ప్యాకేజీ..

వరుణ్ అయితే భారత్‌కు సర్‌ప్రైజ్ ప్యాకేజీ. టోర్నీ కోసం ముందుగా ఎంపిక చేసిన జట్టులో అతడికి చోటు దక్కలేదు. కానీ ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లలో సత్తా చాటిన అతడిని.. రిజర్వ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్‌కు గాయం అవడంతో దుబాయ్ విమానమెక్కించారు. తొలి రెండు మ్యాచ్‌లకు అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. వరుణ్ బౌలింగ్ నైపుణ్యానికి దుబాయ్ పిచ్ నప్పుతుందని భావించిన మేనేజ్‌మెంట్.. అతడిని న్యూజిలాండ్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో ఆడించింది. తన మిస్టరీ స్పిన్‌తో స్వదేశంలో ఇంగ్లీష్ ఆటగాళ్లను ఆటాడుకున్న వరుణ్.. దుబాయ్‌లో కివీస్‌తో తొలి మ్యాచ్‌లోనే 5 వికెట్ల ప్రదర్శన చేయడంతో అతడిని పక్కనబెట్టని పరిస్థితిని సృష్టించుకున్నాడు. 250 పరుగుల ఛేదనలో భాగంగా సాఫీగా లక్ష్యం వైపునకు సాగుతున్న కివీస్ ఇన్నింగ్స్‌ను పేకమేడలా కూల్చి ఆ జట్టు ఓటమికి పునాదులు వేసింది వరుణే. ఆ తర్వాత సెమీస్ పోరులో ప్రమాదకర ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసిందీ అతడే. ఫైనల్‌లో పేసర్లను కివీస్ ఓపెనర్ రచిన్ దంచికొడుతుండటంతో రోహిత్ ఆరంభంలోనే వరుణ్, కుల్‌దీప్‌నకు బంతినివ్వడంతో మ్యాచ్ ఉన్నఫళంగా మలుపు తీసుకుంది. వరుణ్.. విల్ యంగ్‌ను ఔట్ చేసి కివీస్ జోరుకు బ్రేకులు వేస్తే, కుల్‌దీప్ వరుస ఓవర్లలో రచిన్, కేన్ విలియమ్సన్‌ను ఔట్ చేసి ఆ జట్టును పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ స్పిన్నర్లతో ఏకంగా 38 ఓవర్లు వేయించి విజయానికి బలమైన పునాధులు వేసుకుంది.

## ఐపీఎల్ నుంచి బ్రూక్ ఔట్

లండన్: ఇంగ్లండ్ యువ బ్యాటర్, ఆ జట్టు భావి సారథిగా బావిస్తున్న హ్యారీ బ్రూక్ వరుసగా రెండో ఏడాదీ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. మరో రెండు వారాల్లో ఈ మెగా టోర్నీ ప్రారంభమవ్వాల్సి ఉండగా ఆదివారం అతడు తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఈ విషయాన్ని ప్రకటించాడు. 'వచ్చే ఐపీఎల్ సీజన్ నుంచి వైదొలగాలని నేను కఠిన నిర్ణయం తీసుకున్నాను. ఇందుకు గాను ఫ్రాంచైజీతో పాటు అభిమానులను క్షమాపణ కోరుతున్నాను' అని బ్రూక్ రాసుకొచ్చాడు. 26 ఏండ్ల బ్రూక్‌ను 2024 ఎడిషన్‌కు ముందు జరిగిన వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 6.25 కోట్లకు దక్కించుకుంది. ఆ సీజన్‌లోనూ అతడు ఆడలేదు. తాజాగా తప్పుకుంటున్నందుకు గాను బీసీసీఐ అతడిపై కఠిన చర్యలకు దిగే అవకాశముంది.

# వేదికపై మమ్మల్నెందుకు పిలువలేదు?

- **ఐసీసీ తీరుపై పీసీబీ గుస్సా**

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులు కలిగినప్పటికీ ఫైనల్‌ను తమ దేశంలో నిర్వహించుకోలేకపోయామనే బాధలో ఉన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు మరో అవమానం ఎదురైంది. ఫైనల్ ముగిసిన తర్వాత నిర్వహించిన ప్రెజెంటేషన్ సెర్మనీలో భాగంగా వేదికపై పీసీబీ నుంచి ఒక్క ప్రతినిధీ లేకపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. దీనిపై పీసీబీ.. ఐసీసీ తీరుపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. స్టేజీపై ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా, న్యూజిలాండ్ క్రికెట్ సీఈవో రోజర్ ట్వోజ్ ఉన్నారు. పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ పార్లమెంటు సమావేశాల



కారణంగా దుబాయ్‌కు వెళ్లలేదు. కానీ పీసీబీ సీఈవో సుమైర్ అహ్మద్ సయ్యిద్‌తో పాటు పీసీబీ డైరెక్టర్ ఉస్మాన్ వహలా దుబాయ్‌లోనే ఉన్నప్పటికీ వారిని ఆహ్వానించలేదు. దీనిపై పాక్ మాజీ క్రికెటర్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఐసీసీ, పీసీబీ సీఈవోకు సమాచార లోపం వల్ల ఇలా జరిగిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఐసీసీ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'నఖ్వీ దుబాయ్‌కు రాలేదు. ఆతిథ్య దేశ బోర్డు తరపున హెడ్ (అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, చైర్మన్, సీఈవో)ను మాత్రమే మేం అవార్డుల కార్యక్రమానికి పిలిచాం' అని చెబుతున్నప్పటికీ అక్కడే ఉన్న సుమైర్, ఉస్మాన్‌ను ఎందుకు పిలవలేదనేది పీసీబీ వాదనగా ఉంది. భారత్ ట్రోఫీ గెలవడం వల్లే పాక్ ప్రతినిధులు వేదికపైకి రాలేదన్న గుసగుసలూ వినిపిస్తున్నాయి. ఇక పోడియంపై ప్రతినిధి లేకపోవడంతో పాటు భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్‌లో చాంపియన్స్ ట్రోఫీ లోగోను బ్రాడ్‌కాస్టర్లు మార్చడం.. ఆసీస్-ఇంగ్లండ్ మధ్య లీగ్ మ్యాచ్‌లో భారత జాతీయ గీతం వినిపించడంపై పీసీబీ గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది.

## ఉత్కంఠ పోరులో ముంబై విజయం




ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్‌లో భాగంగా తాము ఆడిన చివరి లీగ్ మ్యాచ్‌ను గుజరాత్ జెయింట్స్ ఓటమితో ముగించింది. ముంబైలోని బ్రబోర్న్ స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో ఆద్యంతం ఉత్కంఠగా జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. 9 పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై.. హర్మన్‌ప్రీత్ (54), సీవర్ (38) ఆదుకోవడంతో 179/6 స్కోరు చేసింది. ఛేదనలో గుజరాత్ 170/9 వద్దే ఆగిపోయింది. ప్రధాన బ్యాటర్లంతా విఫలమైనా భార్తీ ఫల్మలి (61) జెయింట్స్ శిభిరంలో ఆశలు రేపింది. కానీ ఆఖర్లో ఆ జట్టు తడబాటుకు లోనై ఓటమిని కొనితెచ్చుకుంది.



## ఆలిండియా పోలీసు పోటీల్లో సత్తా

### టీజీ పోలీసులకు 4 రజత, 5 కాంస్య పతకాలు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన 1వ ఆలిండియా పోలీస్ కబడ్డీ క్లస్టర్ పోటీల్లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. పలు విభాగాల్లో 4 రజత, 5 కాంస్య పతకాలు సాధించారు. ఈనెల 2 నుంచి 6 దాకా జలంధర్‌లో కబడ్డీ, ఖో-ఖో, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్ పోటీలు జరిగాయి. ఫెన్సింగ్ టీమ్ ఈవెంట్‌లో ఎస్ఆర్ అర్జున్, జి.ఓంకార్‌నాథ్, కె. సతీష్ కుమార్, వై.రాఘువేంద్రలు రజత పతకం కైవసం చేసుకున్నారు. మహిళా విభాగంలో జి.స్పందన, జి.అంబికా, షేక్ ఫౌజియా కాంస్య పతకం గెలిచారు. ఫెన్సింగ్ వ్యక్తిగత ఈవెంట్‌లో షేక్ ఫౌజియా కాంస్యం నెగ్గగా.. జిమ్నాస్టిక్స్ వ్యక్తిగత ఈవెంట్‌లో బి. మౌనికా కాంస్య పతకం సాధించింది. పురుషులు 4, మహిళలు 3, వ్యక్తిగత ఈవెంట్లలో మరో రెండు పతకాలు కలిపి మొత్తంగా 9 పతకాలు సాధించారు. విజేతలను డీజీపీ జితేందర్ అభినందించి సత్కరించారు.

## ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌కు వేళాయె

### నేటి నుంచే టోర్నీ ప్రారంభం

### టైటిల్ కోసం 24 ఏండ్లుగా ఎదురుచూపులు



బర్మింగ్‌హామ్: బ్యాడ్మింటన్‌లో ప్రతిష్టాత్మకంగా భావించే ఆల్‌ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్స్ - 2025కు వేళైంది. మంగళవారం నుంచి బర్మింగ్‌హామ్ వేదికగా ఈ టోర్నీకి తెరలేవనుంది. 1980లో ప్రకాశ్ పదుకునే, 2001లో పుల్లెల గోపీచంద్ చరిత్రాత్మక విజయాల తర్వాత ఈ టోర్నీలో భారత్ ఇప్పటిదాకా ఏ విభాగంలోనూ టైటిల్ గెలవలేదు. 2015లో సైనా నెహ్వాల్, 2022లో లక్ష్యసేన్ తుది మెట్టు వరకూ వెళ్లినా ఆఖర్లో తడబాటుకు గురై రన్నరప్‌తో సరిపెట్టుకున్నారు. ఈ ఏడాది పురుషుల సింగిల్స్ విభాగంలో లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్ బరిలో ఉండగా మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోద్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం పునరాగమనం చేయనుండగా మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్, అశ్విని - తనీషా, ప్రియా-శృతి బరిలో ఉన్నారు. గాయాలు, విరామాల తర్వాత ఈ టోర్నీ ఆడనున్న భారత షట్లర్లు ఏ మేరకు సత్తా చాటుతారనేది ఆసక్తికరం.

